నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 15 జూన్ 2024 | ADILABAD NIRMAL

## రైతులకు రసీదులు ఇవ్వకుంటే చర్యలు తప్పవు

### నిర్మల్ జిల్లా టాస్క్‌ఫోర్స్ ఏడీఏ విద్యాసాగర్


తనిఖీ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ ఏడీఏ విద్యాసాగర్

లోకేశ్వరం, జూన్, 14: రసాయన ఎరువులు, విత్తనాలు విక్రయించే షాపుల యజమానులు రైతులకు పూర్తి వివరాలతో కూడిన రసీదులు ఇవ్వకుంటే చర్యలు తప్పవని జిల్లా టాస్క్‌ఫోర్స్ ఏడీఏ విద్యాసాగర్ హెచ్చరించారు. శుక్రవారం లోకేశ్వరం మండల కేంద్రంలో ఎరువులు, విత్తనాల దుకాణాల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో బోర్డులు ఏర్పాటు చేసి స్టాక్ వివరాలు తెలియజేయాలని సూచించారు. నిర్ణీత ధరలకే ఎరువులు, విత్తనాలను విక్రయించాలన్నారు. రసీదులో పేర్కొన్న డబ్బులను మాత్రమే తీసుకోవాలని, అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట టెక్నికల్ ఏవో వినోద్, మండల వ్యవసాయ అధికారి గణేశ్ ఉన్నారు.

## జిల్లా పోలీసు కార్యాలయ పనుల పరిశీలన

సోన్, జూన్ 14 : నిర్మల్ మండలంలోని ఎల్లపెల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పోలీసు కార్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ జానకీ షర్మిలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీరి వెంట అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్ రాజు, తదితరులున్నారు.


ఎస్పీ జానకీ షర్మిలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్


కుప్టిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

## చెట్లతోనే మానవ మనుగడ

### బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జూన్ 14 : చెట్లతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుప్టి గ్రామంలోని కేసీఆర్ పార్కులో మొక్కలు నాటి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. భావి తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి నీళ్లుపోశారు. అనంతరం గ్రామంలో పర్యటించి బీడీ కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ రాథోడ్ సజన్, మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, కొయ్యడి గంగయ్య, అరుణ్‌గౌడ్, తులసీదాస్, కమలాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివించాలి

ప్రభుత్వ బడిలోనే పిల్లలను చదివించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం మండలంలోని రాజురా గ్రామంలో బడిబాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, వసతులు అందుతున్నాయని తెలిపారు. అనంతరం పిల్లలకు పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం అందించారు. అనంతరం గ్రామానికి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సవాయిరాం, నాయకులు జాదవ్ వసంత్‌రావ్, గులాబ్‌సింగ్, జాదవ్ గణేశ్, ఉపాధ్యాయురాలు, అంగన్‌వాడీ టీచర్, ఐకేపీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


# జేఎన్‌టీయూ కలేనా?

● బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు ● ఇంజినీరింగ్ కళాశాలపై ఊసెత్తని కాంగ్రెస్ సర్కారు ● విద్యార్థుల్లో ఆందోళన

ఆదిలాబాద్, జూన్ 15 ( నమస్తే తెలంగాణ) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేద విద్యార్థులకు సర్కారు చదువులు అందని ద్రాక్షలా మారాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ సర్కారు పదేళ్ల పాలనలో పేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసింది. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అమలు చేయడంతో పాటు ప్రతి జిల్లాకూ మెడికల్ కళాశాలలు మంజూరు చేసింది. రెసిడెన్షియల్ స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచితంగా ఇంగ్లిషు మీడియం, కార్పొరేట్ స్థాయిలో విద్య, పౌష్టికాహారం, వసతులు అందజేసింది. దీంతో విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో చేరడానికి పోటీ పడ్డారు. ఈ మేరకు ఇంజినీరింగ్ విద్యార్థులు ఆదిలాబాద్ జిల్లాలోనే ఉపాధి పొందేలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా రెండు ఐటీ కంపెనీలను ఏర్పాటు చేయడంతో పాటు రూ.40 కోట్లతో ఐటీ టవర్‌ను నిర్మించింది. బీఆర్‌ఎస్ సర్కారు అందించిన సహకారంతో యువత స్థానికంగా ఉన్నత ఉద్యోగాలు చేసే అవకాశం లభించింది. రెండు కంపెనీల్లో 230 మంది ఉద్యోగాలు చేస్తున్నారు.

### ఇంజినీరింగ్ కళాశాల వచ్చేనా..?

ఉమ్మడి రాష్ట్రంలో వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. విద్యా, ఉపాధి రంగాల్లో ఇతర జిల్లాలతో పోటీ పడేలా చర్యలు తీసుకున్నది. జిల్లా కేంద్రానికి వ్యవసాయ, జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలను మంజూరు చేసింది. రెండేళ్ల కిందట మంజూరైన అగ్రికల్చర్ కళాశాలలో గతేడాది నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 60 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వం గతేడాది ఆగస్టులో జిల్లా కేంద్రంలో జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేసింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ జీవో ఎమ్ఎస్ 67ను సైతం జారీ చేసింది. జేఎన్టీయూ రిజిస్ట్రార్, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శులు కళాశాల ఏర్పాటులో భాగంగా తగిన చర్యలు తీసుకోవాలని అప్పటి ఉన్నత విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కళాశాల ఏర్పాటు కోసం 20 ఎకరాల స్థలాన్ని సేకరించాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మంజూరై పది నెలలైనా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కళాశాల ఏర్పాటు విషయంలో సందిగ్ధత నెలకొన్నది. గతేడాది మంజూరైన జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరునెలల్లో చర్యలు తీసుకుంటే ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు అడ్మిషన్లు పొందే అవకాశాలుండేవి. జిల్లాకు చెందిన విద్యార్థులు సైతం దూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా ప్రభుత్వ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుకునే అవకాశం లభించేది. ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాట్లు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.


GOVERNMENT OF TELANGANA
ABSTRACT

TECHNICAL EDUCATION - Establishment of JNTU Engineering College at Adilabad - Permission - Accorded - Orders - Issued.

HIGHER EDUCATION (TE) DEPARTMENT

G.O.Ms.No.67 | Dated.22-08-2023. Read the following:-

-o0o-

ORDER:-

Government after careful consideration of the matter, hereby accord permission for establishment of JNTU Engineering College at Adilabad.

2. Orders regarding courses, staff and budget will be issued separately.

3. The Registrar, Jawaharlal Nehru Technological University, Hyderabad and the Secretary, Telangana State Council of Higher Education, Hyderabad shall take further necessary action accordingly.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

KARUNA VAKATI
SECRETARY TO GOVERNMENT

To
The Registrar, Jawaharlal Nehru Technological University, Hyderabad.
The Secretary, Telangana State Council of Higher Education, Hyderabad.
Copy to
The Commissioner of Technical Education, Telangana, Hyderabad.
The Finance (EBS.IV) Department.
P.S. to Secretary to C.M.
P.S. to Hon'ble Minister for Finance.
P.S. to Hon'ble Minister for Education.
P.S. to Chief Secretary to Government.
P.S. to Secretary to Government(Education).
SF/SC.

//FORWARDED :: BY ORDER//

SECTION OFFICER

ఆదిలాబాద్‌కు జేఎన్టీయూ కళాశాల మంజూరు చేస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో



### కళాశాల ఏర్పాటు చేయాలి



*బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతేడాది ఆగస్టులో ఆదిలాబాద్‌కు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేసింది. సాంకేతిక విద్యాశాఖ జీవో ఎమ్ఎస్ 67ను జారీ చేసింది. జిల్లా కేంద్రంలో కళాశాల ఏర్పాటు కోసం 20 ఎకరాల స్థలాన్ని సేకరించాలని సూచించారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఏ మాత్రం స్పందన కనిపించడం లేదు. కళాశాల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటే ఈ విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభమయ్యేవి. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులకు నిరాశే ఎదురైంది. దీంతో విద్యార్థులు దూర ప్రాంతాల్లోని కళాశాలలకు వెళ్లాల్సి వస్తున్నది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆర్థికంగా నష్టం జరుగుతున్నది. ఇప్పటికైనా ఆదిలాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.*

**- శివకుమార్, ఆదిలాబాద్**

### మొలకలను బతికించేందుకు
## నీటి తడులు


ధనోరాలో పత్తి చేనులో స్ప్రింక్లర్లతో నీటి తడి అందిస్తున్న రైతు

*భీంపూర్, జూన్ 14 : వాతావరణం చల్లబడినా సరైన వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్ నెల ఆరంభంలో కురిసిన జల్లులకు పత్తి, కంది విత్తనాలను రైతులు వేశారు. వర్షాలు లేకపోవడంతో మొలకలు బతికించేందుకు సాగునీటి సౌకర్యం ఉన్న రైతులు స్ప్రింక్లర్లు, పైపులతో నీటి తడులు అందిస్తున్నారు. వర్షాధారంగా విత్తనాలు వేసిన రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. భీంపూర్ మండలం ధనోరా, గోనా, పిప్పల్‌కోటి, కరంజి(టీ), గుబిడి రైతులు మొలకలను బతికించేందుకు నీటి తడులు అందిస్తున్నారు. రెండు మూడు భారీ వర్షాలు తర్వాతే విత్తనాలు వేయాలని మరికొంత మంది రైతులు సాగును ప్రారంభించలేదు.*

## లేఖర్‌వాడలో గాలివాన బీభత్సం

### విరిగిపడిన విద్యుత్ స్తంభాలు..కూలిన ఇండ్లు



లేఖర్ వాడలో గాలికి విద్యుత్ స్తంభంపై ఎగిరి పడ్డ రేకు, విరిగి పడిని విద్యుత్ స్తంభం

జైనథ్, జూన్ 14 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని లేఖర్‌వాడలో గురువారం రాత్రి గాలివాన బీభత్సంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈదురు గాలులకు 6 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కొన్ని స్తంభాలు ఇండ్లపై పడ్డాయి. విద్యుత్ సరఫరా లేక పోవడంతో ప్రమాదం తప్పింది. 6 పెంకుటిళ్లు, 6 పశువుల పాకలు కూలిపోయాయి.లేఖర్‌వాడలో రూ.లక్షల్లో ఆస్తినష్టం జరిగింది. అధికారులు విచారణ చేపట్టి నష్టపరిహారం అందించాలని బాధితులు కోరారు.

### నిర్మల్ జిల్లాలో 8.4 మి.మీ వర్షపాతం

నిర్మల్ అర్బన్, జూన్ 14 : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా గత 24 గంటల్లో 8.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా దస్తురాబాద్ మండలంలో 45.2మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. కడెంలో 27.8, సోన్‌లో 23.8, లక్ష్మణచాందలో 17.8, బాసరలో 14.4, ఖానాపూర్‌లో 13.6, లోకేశ్వరంలో 8.0,నిర్మల్‌లో 5.2, పెంబిలో 4.2, నిర్మల్ రూరల్‌లో 6.4, మామడలో 3.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. కుభీర్, తానూర్, ముథోల్, భైంసా, కుంటాల, నర్సాపూర్ (జీ), దిలావర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో వర్షం కురవలేదు.

### పిడుగు పాటుతో ఎద్దు మృతి

కుంటాల, జూన్, 14: నిర్మల్ జిల్లా కుంటాల మండలం అంబకంటిలోని రాయపాడ్ తండాలో రాథోడ్ ప్రకాశ్‌కు చెందిన ఎద్దు శుక్రవారం పిడుగు పాటుకు గురై మృతి చెందింది. ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుందని, నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.


మృతి చెందిన ఎద్దు

# ఆయిల్‌పామ్ గెలలొచ్చాయ్

● మొదటి విడుతలో సాగైన పంట కోతకు ● దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లిలో 15 ఎకరాల్లో దిగుబడి ● మార్కెట్లో టన్నుకు రూ.13,200 ధర


ఆయిల్‌పామ్ మొక్కకు వచ్చిన గెలలు


మొక్క నుంచి కోసిన గెలలను చూపుతున్న రైతులు


గుండంపెల్లిలో గెలలను కోస్తూ..

నిర్మల్, జూన్ 14(నమస్తే తెలంగాణ): రైతులను లాభాల బాట పట్టించడమే కాకుండా, ప్రత్యామ్నాయ సాగు వైపు దృష్టి సారించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ఎంతో ప్రోత్సహించింది. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చిన రైతులకు అనేక సబ్సిడీలతో పాటు డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాన్ని కల్పించింది. నాలుగేళ్ల పాటు పంట నిర్వహణ, ఎరువుల కోసం ఎకరానికి రూ.4200 చొప్పున అందించింది. జిల్లా రైతులకు అందుబాటులో ఉంచేందుకు సారంగాపూర్ మండలం బీరవెల్లి వద్ద పెద్ద ఎత్తున నర్సరీని ఏర్పాటు చేసి ఆయిల్‌పామ్ మొక్కలను పెంచారు. రూ.200 విలువైన మొక్కకు రూ.180 సబ్సిడీ ఇచ్చి కేవలం రూ.20కే రైతులకు అందించారు. నిర్మల్ జిల్లాలో పెద్ద సంఖ్యలో రైతులు ఆయిల్‌పామ్ తోటలను పెంచేందుకు ముందుకు వచ్చారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 7 వేలకు పైగా ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలను పెంచుతున్నారు. మూడేళ్ల క్రితం మొదటి విడుతలో నాటిన ఆయిల్‌పామ్ మొక్కలకు ప్రస్తుతం గెలలు కూడా వస్తున్నాయి. జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లికి చెందిన మహిళ రైతు రాగలత తన వ్యవసాయ క్షేత్రంలో 2021 జూన్‌లో 15 ఎకరాల్లో 1000 మొక్కలు నాటింది. అందులో దాదాపు 600కు పైగా మొక్కలకు ప్రస్తుతం గెలలు వచ్చాయి. సరిగ్గా మొక్కలు నాటిన మూడేళ్ల తర్వాత శుక్రవారం నుంచి ఇక్కడి తోటలో గెలల కోతను ప్రారంభించారు. మొక్కల నుంచి కోసిన గెలలను కొత్తగూడెం భద్రాచలం జిల్లాలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి తరలించనున్నారు. ప్రస్తుతం అక్కడ టన్నుకు రూ.13200 ధర ఉన్నట్లు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో పండిన ఆయిల్‌పామ్ దిగుబడులను ఇక్కడే విక్రయించేందుకు అనుగుణంగా జిల్లాలోని పాక్‌పట్ల ప్రాంతంలో ఆయిల్ పాం పరిశ్రమ ఏర్పాటుకు అప్పటి మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నేటికీ పరిశ్రమకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ఈ ప్రాంతంలో ఆయిల్‌పామ్ తోటల పెంపకాన్ని పర్యవేక్షిస్తున్న ప్రీ-యూనిక్ కంపెనీ రవాణా ఖర్చులు భరించి ఇక్కడి పంటను అశ్వరావుపేటలోని ఆయిల్ పాం పరిశ్రమకు తరలిస్తున్నది. రవాణా, ఇతర ఖర్చులు లేకుండానే పంట దిగుబడులను అమ్ముకునే వెసులుబాటును ప్రీ-యూనిక్ కంపెనీ కల్పిస్తుండడంపై ఆయిల్‌పామ్ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## 'ధరణి' అర్జీలను త్వరగా పరిష్కరించాలి

### కలెక్టర్లకు సీసీఎల్ ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశం


వీసీలో పాల్గొన్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, అధికారులు


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ఎదులాపురం, జూన్14: ధరణి మాడ్యూల్స్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో ధరణి, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ తహసీల్దార్లతో మాట్లాడారు. మండలంలోని ధరణి మాడ్యూల్స్‌లో పెండింగ్ ఉన్న దరఖాస్తులను మూడు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తునూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.

### విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేయాలి

విత్తనాల దుకాణాలు, గోదాములు తనిఖీ చేయాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించి, ముంపు ప్రాంతాలను గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు.

### 'ధరణి' అర్జీల పరిష్కారానికి చర్యలు


నిర్మల్ అర్బన్, జూన్ 14 : ధరణి దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. సీసీఎల్ఏ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధరణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల్లో జిల్లాల వారీగా పరిష్కారమైనవి, పెండింగ్ ఉన్న వాటిపై తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా వచ్చిన ధరణి, ప్రజావాణి దరఖాస్తులు, వివిధ మాడ్యుల్స్ సెషన్స్ కోర్టు కేసులు తదితర అంశాలను కలెక్టర్ ప్రధానకార్యదర్శికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ..ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మండలాల వారీగా దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులతో చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో సూర్యారావు, తహసీల్దార్లు, ఈడీఎం నదీం, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలి

ఎదులాపురం, జూన్14: ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు ఏడాది నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయించాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ నెల 20 న జరగనున్న జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్బెండజోల్ మాత్రల పంపిణీ ఏర్పాట్లపై లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 19 ఏళ్లలోపు చిన్నారులు, విద్యార్థులు 2,21,141 మంది ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. ఈ నెల 20న మిస్సయిన వారికి 27న కచ్చితంగా మాత్రలు వేయించాలని పేర్కొన్నారు.

### బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా లక్ష్యాలను సాధించేందుకు ఎంఈవోలు బాధ్యత తీసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రైమరీ స్కూళ్లలో చేర్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్,రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఐవోవైసీ శ్రీనివాస్, డీఈవో ప్రణిత, డీడబ్ల్యూవో సబిత, సీడీపీవోలు, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీపీవోలు తదితరులున్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

## విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

ఉట్నూర్, జూన్ 14 : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా అన్నారు. శుక్రవారం ఐటీడీఏ పరిధిలోని నర్సాపూర్-బీ, సాలేవాడ పాఠశాల శాటిలైట్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల బోర్డులపై ఆంగ్ల పదాలు రాస్తూ విద్యార్థులను చదివించారు. కొందరు విద్యార్థులు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఉపాధ్యాయులను మందలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించేందుకు సులువైన పద్ధతిని పాటించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, వంటగదిని పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా